క్లుప్తంగా

సాంబశివరాజు విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు..

● ఎమ్మెల్సీ పెనుమత్స



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: ప్రజా శ్రేయస్సే పరమావధిగా జీవించిన నిస్వార్థ నాయకుడు దివంగత మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని ఆయన తనయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. మండలంలోని మొయిద ఆయన స్వగృహంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దశాబ్దకాలం ప్రజలకు నిస్వార్థ సేవలందించిన తన తండ్రిని గౌరవించుకోవాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు నాయకులు పెనుమత్స సంతోష్ బాబు, అట్టాడ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రామనారాయణంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణం ప్రాంగణంలో శ్రావణమాసం సందర్భంగా గురువారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు చాణక్య, శ్రీహర్ష ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ కలశ స్థాపన, విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం నీరజవల్లి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

'సంస్కృతం'ను కొనసాగించాలి



వినతిపత్రం అందుకుంటున్న డిప్యూటీ ఈఓలు

విజయనగరం అర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలో సంస్కృతం సబ్జెక్ట్‌ను కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులు డిప్యూటీ ఈఓలు వాసుదేవరావు, పి.బ్రహ్మాజీరావులను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆపస్ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రాచీన నాగరికత గల సంస్కృతం సబ్జెక్ట్‌ను పబ్లిక్ పరీక్షలో కనీసం 30 మార్కులకు నిర్వహించాలని కోరారు. డిప్యూటీ ఈఓలను కలిసిన వారిలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఈ.రామునాయుడు, ఉపాధ్యక్షులు ఎన్‌వీఎస్ కృష్ణారావు, ఎ.భాస్కరరావు, హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షుడు టి.సన్యాసిరాజు, సంస్కృత ఉపాధ్యాయులు ఎస్.సత్యపావని, కె.సంతోషలక్ష్మి, ఎం.రాధామణి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించే బాధ్యత అందరిది..

● నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీరాములనాయుడు



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న నగర పాలక కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: మానవాళికి ప్రాణవాయువు నిచ్చే మొక్కలను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు అన్నారు. మేరీ మిట్టి – మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక పద్మావతినగర్‌లో ఉన్న పార్కులో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధుల సౌజన్యంతో 200 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మొక్కలను నాటి, వాటి సంరక్షణ బాధ్యతలను సమీపంలో ఉన్న సచివాలయ సిబ్బందికి అప్పగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విరివిగా మొక్కలు నాటడం వల్ల వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. సకాలంలో వర్షాలు కురవాలన్నా, మానవ జీవనానికి ప్రాణవాయువు కావాలన్నా చెట్లు అవసరమని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి. నరేష్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనే మా లక్ష్యం..

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



విజయనగరం: వైఎస్సార్‌నగర్‌లో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: టీడీపీ హయాంలో జరిగిన స్వార్థపూరిత పాలనకు.... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న సంక్షేమ పాలనకు మధ్య తేడాను ప్రజలంతా గమనించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 50వ డివిజన్ వైఎస్సార్‌నగర్‌లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే నాలుగేళ్ల కాలంలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని తెలియజేస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే స్థానిక సమస్యలపై ఆరా తీసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా సంక్షేమ పాలన సాగుతోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తుండడం వల్ల దళారీల బెడద తప్పిందని చెప్పారు. పారదర్శక పాలన కొనసాగుతుండడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన నవరత్నాల హామీల్లో భాగంగా అర్హత గల వారందరికీ ఆసరా, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, వాహనమిత్ర, రైతుభరోసా వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తూ ప్రజలకు మరింత చేరువవుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్ర స్వామిని మరోసారి గెలిపించాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి మాట్లాడుతూ, తమ డివిజన్ పరిధిలోని వైఎస్సార్‌నగర్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తోనంగి జగన్నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

29, 42 డివిజన్‌లలో..

విజయనగరం: నగరంలోని 29, 42 డివిజన్‌లలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల కృష్ణారావు, డాక్టర్ వీఎస్ ప్రసాద్, ఈశ్వర్ కౌశిక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై ఆరా తీస్తూ.. వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం సచివాలయ కన్వీనర్ ఓగిరెడ్డి సతీష్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు గుణశేఖర్ మాట్లాడుతూ, తమ డివిజన్‌లో ఇప్పటికే మూడున్నర కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి జరగాలంటే జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా, కోలగట్ల వీరభద్ర స్వామిని శాసనసభ్యుడిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాబోయే తరాలకు భరోసా 'సీఎం జగన్'

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భవిష్యత్ తరాలకు భరోసాగా నిలబడుతున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట 19వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే బడ్డుకొండ ఉత్సాహంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ, గత పాలనలో బడుగు,బలహీన వర్గాలు అట్టడుగు స్థాయిలో ఉండేవన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వారి జీవితాల్లో వెలుగులు విరబూశాయని చెప్పారు. పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ రాష్ట్రంగా నిలబెట్టేందుకు పాటుపడుతున్న జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

అవినీతిరహిత పాలన..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అవినీతిరహిత పరిపాలనను అందిస్తున్నామని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. గతంలో సంక్షేమ పథకాలు వర్తించాలంటే కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారని, జన్మభూమి కమిటీలకు లంచం ఇస్తే కాని పని జరిగేది కాదని గుర్తు చేశారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటుతో నేరుగా ఇంటివద్దకే పథకాలు చేరుతున్నాయని తెలిపారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయడమే కాకుండా ఆర్థిక చేయూతను అందిస్తున్నామన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ బాలాజీ ప్రసాద్, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, కౌన్సిలర్ తుమ్ము భారతి, కార్పొరేషన్ డైరెక్టర్లు జానా ప్రసాద్, రేగాన శ్రీనివాసరావు, మద్దిల వాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు గంటా సతీష్, నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, పోలుబోతు నారాయణమూర్తి, ఎంఎం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

మాజీ మంత్రి సాంబశివరాజుకు నివాళులు



మాజీ మంత్రి సాంబశివరాజు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

● ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స
● ఘనంగా మాజీ మంత్రి పెనుమత్స జయంతి

నెల్లిమర్ల రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో దివంగత మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు అత్యంత కీలక పాత్ర పోషించారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. మండలంలోని మొయిద గ్రామంలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆయన తండ్రి సాంబశివరాజు 90వ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు సాంబశివరాజు సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, సాంబశివరాజు ఎన్నో ఉన్నత పదవులు చేపట్టినప్పటికీ నిరాడంబరంగానే ఉండేవారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసి ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని చెప్పారు. పెద్దాయన శిష్యరికంలో ఎంతో మంది నేతలుగా ఎదిగారని తెలిపారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, నేతలు గంటా సత్యనారాయణ, మజ్జి గణేష్, కేవీ హర్షవర్ధన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఊరిచెంతనే మెరుగైన వైద్యం



విద్యార్థుల ఆరోగ్యంపై ఆరాతీస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

● జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు

విజయనగరం రూరల్: ఊరు, ఇంటి వద్దనే మెరుగైన వైద్యం అందించడమే 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు అన్నారు. మండలంలోని ముడిదాం గ్రామంలో రాకోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. గ్రామంలో ప్రతిఒక్కరికీ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.జగదీష్‌ను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్‌రాజు, ఎపిడిమిక్ సెల్ ఈఓ సత్తిరాజు, సీహెచ్‌ఓ మాణిక్యం, పీహెచ్‌ఎన్ రాముడమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే తనయుడి జన్మదినం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు రెండో కుమారుడు బడ్డుకొండ ప్రదీప్‌నాయుడి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల నడుమ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కేక్ కట్ చేసి ప్రదీప్‌నాయుడికి తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, కార్పొరేషన్ డైరెక్టర్లు జానాప్రసాద్, రేగాన శ్రీను, మద్దిల వాసు, నేతలు గంటా సత్యనారాయణ, మజ్జి గణేష్, నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, పోలుబోతు నారాయణమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారును గెలిపించండి

గంట్యాడ: పెంటశ్రీరాంపురం సర్పంచ్ స్థానానికి నిర్వహిస్తున్న ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న కరక గౌతమిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రజలను కోరారు. పెంటశ్రీరాంపురంలో బుధవారం రాత్రి నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని చెప్పారు. పార్టీలు, కులాలు, మతాలకతీతంగా పథకాలు అందిస్తున్నామని, ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు తలుపుతట్టి అవ్వాతాతలకు, దివ్యాంగులకు, వితంతువులకు పింఛన్లు అందిస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందిస్తున్నామని, ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందన్నారు. టీడీపీ ప్రజలకు చేసింది ఏమీ లేదని, ఆ పార్టీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

అభివృద్ధికే ప్రాధాన్యం

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
● నగరంలోని 21వ డివిజన్‌లో రూ.23 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి చేపట్టడమే తమ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 21వ డివిజన్‌లో వివిధ ప్రాంతాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం ఉదయం శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలోని వైఎస్సార్‌నగర్, గెడ్డవీధి ప్రాంతాలలో రహదారులు, కాలువ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ కనకల నాగవల్లి, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కంటుభుక్త తవిటరాజు మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తెలుసుకున్న సమస్యలను పరిష్కరిస్తుండడం అభినందనీయమన్నారు. త్వరలోనే పనులు పూర్తిచేసి ప్రజా వినియోగంలోకి తీసుకురానున్నట్లు చెప్పారు. రూ.23 లక్షలతో నిర్మించనున్న రహదారులు, కాలువలు వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరగనుందని తెలిపారు. కార్యక్రమంలో నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, కనకల గిరి, కాళ్ల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● సీఐ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న భోగాపురం సీఐ వెంకటేశ్వరరావు

పూసపాటిరేగ: కొప్పెర్ల సర్పంచ్ ఉప ఎన్నికలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని భోగాపురం సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొప్పెర్ల సచివాలయం వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలకు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలని అభ్యర్థులకు సూచించారు. మద్యం, కరెన్సీతో ఓటర్లను ప్రలోభపెట్టినట్టైతే చర్యలు తప్పవన్నారు. ప్రజలు గ్రామాలలో గుంపులు గుంపులుగా తిరగవద్దని సూచించారు. సమావేశంలో ఎస్సై నరేష్, ప్రజాప్రతినిధులు లంకలపల్లి రాజారావు, శంకాబత్తుల సత్తిబాబు, ఆకిరి జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు

డెంకాడ: అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ఆ శాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ, సర్వసభ్య సమావేశాల్లో లేవనెత్తిన అంశాలు, సమస్యలపై వచ్చే సర్వసభ్య సమావేశంలో వివరణ ఇవ్వాలన్నారు. లేకపోతే అడగడం మినహా వాటి పరిస్థితి ఏమిటన్నది తెలియరావడం లేదన్నారు. ఎంపీపీ వాసుదేవరావు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ కావడం వల్ల రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలన్న లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పిన్నింటి తమ్మునాయుడు, కూరాకుల అనిత, ఎంపీడీఓ స్వరూపారాణి, డీటీ సూర్యకాంతం, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



గంటస్తంభం వద్ద నిరసన తెలియజేస్తున్న కార్మికులు

విజయనగరం ఫూల్‌బాగ్: మున్సిపల్ (ఆప్కోస్) కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ. జగన్ మోహన్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం స్థానిక గంటస్తంభం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు, రిస్క్ అలవెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 24న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మెకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రామచంద్రరావు, తిరుమలరావు, సూరి, వంశీ, రామకృష్ణ, రమణ, కృపారావు, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లికి శ్రావణ సారె..



కోలాట ప్రదర్శనలో వసంత గోష్ఠి మహిళలు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారికి శ్రావణమాస సారెను వసంత గోష్ఠి నిర్వాహకులు గురువారం సమర్పించారు. సంస్థ నిర్వాహకురాలు అంగజాల అన్నపూర్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రావణమాసం సారెగా 30 కిలోల లడ్డూ, ఐదు కిలోల జాంగ్రీ, అరెసెలు, చలిమిడి, మూడు కిలోల కాజాలు, తదితర తీపి పదార్థాలతో పాటు 150 చీరలు, అలంకరణ సామాగ్రిని అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో వసంత గోష్ఠి మహిళలు నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో వసంతగోష్ఠి సభ్యులు అనిత, కె. భవాని, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.



శ్రావణమాస సారెతో పైడితల్లి అమ్మవారు